# Sakshi

# టెట్ కేంద్రాల మార్పునకు అవకాశం

## గందరగోళం నేపథ్యంలో దిద్దుబాటుకు పూనుకున్న పాఠశాల విద్యాశాఖ

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ పరీక్ష సెంటర్ల కేటాయింపులో తీవ్ర గందరగోళం నెలకొన్న నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ పరీక్ష కేంద్రాలు కేటాయించినవారు రాష్ట్రంలోని నిర్ణీత జిల్లాల్లో పరీక్షలు రాసేందుకు ఆప్షన్ల మార్చుకునే అవకాశం కల్పించింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి ప్రకటన విడుదల చేశారు. 'టెట్-2017కు 4,40,518 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈ అభ్యర్థుల్లో 15,603 మందికి మాత్రమే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ పరీక్ష కేంద్రాలు కేటాయించాం. వారు ఆప్షన్లు ఇచ్చిన జిల్లాల్లో పరీక్ష కేంద్రాల్లో అవకాశం లేనందున వారికి ఇతర ప్రాంతాల పరీక్ష కేంద్రాలు కేటాయించాల్సి వచ్చింది. చిత్తూరు, కడప జిల్లాలకు 61,453 మంది దరఖాస్తు చేయగా వారిలో 3,110 మందికి చెన్నై పరీక్ష కేంద్రాన్ని కేటాయించాం. అనంతపురం జిల్లాకు 42,622 మంది దరఖాస్తు చేయగా వారిలో 9,052 మందికి బెంగళూరు కేంద్రాన్నిచ్చాం. కర్నూలు జిల్లాకు 50,808 మంది దరఖాస్తు చేయగా వారినుంచి 3,443 మందికి హైదరాబాద్ కేంద్రాన్ని కేటాయించాం. ఇతర రాష్ట్రాల్లోని కేంద్రాలు కేటాయించిన అభ్యర్థులు మార్చి 2వ తేదీన మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటలవరకు పరీక్ష రాసేందుకు వీలుగా రాష్ట్రంలోని కొన్ని కేంద్రాలకు ఆప్షన్లు మార్పు చేసుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నాం'' అని వివరించారు. చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, కృష్ణ, గుంటూరు జిల్లాల్లోని పరీక్ష కేంద్రాల్లో పరీక్ష రాసేందుకు వీరు ఆప్షన్లు నమోదు చేయవచ్చన్నారు.